సాక్షి
విజయనగరం

గురువారం । 9 । నవంబర్ । 2023

I



వైభవంగా పైడితల్లి అంబలంపూజ

విజయనగరం టౌన్: పైడితల్లి వనంగుడి ఆవరణలో బుధవారం రాత్రి అంబలం పూజ నిర్వహించారు. పూజలో పైడితల్లి దీక్షాపరులు, అయ్యప్పదీక్షధారులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి -IIలో

ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు.



సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్లు -IIలో

రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికలు, బాలుర జట్లు సత్తా చాటాయి.

న్యూస్‌రీల్

డ్వాక్రా ఉత్పత్తులకు ఆదరణ



మాట్లాడుతున్న డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం అర్బన్: నగరంలో 12 రోజుల పాటు నిర్వహించిన డ్వాక్రా బజార్‌కు ప్రజల నుంచి చక్కని ఆదరణ లభించడం హర్షణీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకాలు ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కొద్దిరోజుల్లో రూ.6.39 కోట్ల వ్యాపారం జరగడంతో రానున్న రోజుల్లో ఇటువంటి ప్రదర్శనలను ఇక్కడి ప్రజల నుంచి మంచి ఆదరణ ఉంటుందనే సందేశాన్ని ఇచ్చినట్లయిందన్నారు. బజార్ నిర్వహణకు డీసీసీబీ, ఆబ్కాబ్, మెప్మా, వివిధ బ్యాంకులు, జిల్లా యంత్రాంగం, డీఆర్‌డీఏ అధికారులు చేసిన కృషిని అభినందించారు. ఆయా శాఖల అధికారులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, మెప్మా పీడీ సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని తిరుమలకు ఎమ్మెల్సీ పాదయాత్ర



ఎస్.కోటలో రఘురాజుకు సంఘీభావం తెలిపిన ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీనివాసరావు, రాష్ట్రకార్యదర్శి జగన్నాథం

శృంగవరపుకోట: రాష్ట్రానికి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవరలోని తన నివాసంలో ఎమ్మెల్సీ బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 820 కిలోమీటర్లు 43 రోజుల పాటు సాగే పాదయాత్రను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రారంభించి రఘురాజుకు సంఘీభావం తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర రాత్రి 7 గంటలకు ఎస్.కోట చేరుకుంది. ఎస్.కోటలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, ఐదుమండలాల నాయకులు రఘురాజుతో కలిసి కాసేపు నడిచారు.

10వేల ఎకరాలకు హక్కులు

తెర్లాం: జిల్లాలో 10వేల ఎకరాల డీ పట్టా భూములకు యాజమాన్యపు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. తెర్లాంలో స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డి.పట్టా భూములను జిరాయితీ భూములుగా మార్పు చేసేందుకు తీసుకున్న నిర్ణయంతో ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 2003 సంవత్సరానికి ముందు ప్రభుత్వం పంపిణీ చేసిన డీ పట్టా భూములను జిరాయితీ భూములుగా మార్పు చేస్తున్నామని స్పష్టంచేశారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ సహజిత్ వెంకట్ త్రివినాగ్, బొబ్బిలి ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎంపీడీఓ రామకృష్ణ ఉన్నారు.

జేఎన్‌టీయూ జీవీ విద్యార్థుల నిరసన



జేఎన్‌టీయూ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం ఆకస్మికంగా నిరసనకు దిగారు. హాస్టల్స్‌లో ఉన్న విద్యార్థులందరూ ఒక్కసారిగా వర్సిటీ ముఖద్వారం వద్ద బైఠాయించారు. మెన్, ఉమెన్స్ హాస్టల్స్‌లోని తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్టూడెంట్ మెస్‌లో ఫ్యాకల్టీ ఆధిపత్యం అధికం కావడంతో మెస్ బిల్లులు పెరుగుతున్నాయని వాపోయారు. సమస్యను వీసీ దృష్టికి తీసుకెళ్లకుండా హాస్టల్స్ సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గ్రంథాలయంలో పుస్తకాల కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీకుమార్, వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య విద్యార్థులతో మాట్లాడారు. తొలుత ఆరు సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అయితే, అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు నిరసన కొనసాగించారు.



సాలూరులో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనవాహిని

పేదల బతుకుల్లో... కొత్తవెలుగు



- సంక్షేమ పథకాలతో గిరిజనుల్లో ఆర్థికోన్నతి
- బడుగువర్గాల సంక్షేమానికి జగనన్న ఎనలేని కృషి
- మన్యంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం: పీడిక రాజన్నదొర
- జగన్‌తోనే సామాజిక న్యాయం: ధర్మాన ప్రసాదరావు
- అవినీతిరహిత పాలన జగన్‌తోనే సాధ్యం: తమ్మినేని సీతారాం
- సాలూరులో నిర్వహించిన సామాజిక యాత్రకు పోటెత్తిన జనం
- జగనన్నకు జేజేలు పలికిన అభిమానులు
- సంక్షేమం చేకూరిందంటూ కేరింతలు

సాలూరు:

గిరిజనులు, దళితులు, మైనార్టీలు, వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణ పేదల జీవితాల్లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కొత్తవెలుగు కనిపిస్తోందని, ప్రతి కుటుంబం ఆర్థికోన్నతి దిశగా సాగుతోందని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా బుధవారం ఉదయం సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలం పోరాం గ్రామం నుంచి బస్సు యాత్ర ప్రారంభమైంది. వందలాది మంది యువత, పార్టీశ్రేణులు, అభిమానులు బైక్ ర్యాలీగా అనుసరించారు. జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. కళాకారుల బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలతో యాత్రకు స్వాగతం పలికాయి.

నియోజకవర్గ కేంద్రమైన సాలూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై నిర్వహించిన బహిరంగ సభలో రాజన్నదొర నాలుగున్నరేళ్లుగా గిరిజనులకు కలిగిన సంక్షేమాన్ని వివరిస్తుంటే చప్పట్లతో స్వాగతించారు. క్యాబినేట్‌లో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నాయకులకు జగన్‌మోహన్‌రెడ్డి చోటు కల్పించి నిజమైన సామాజిక సాధికారతకు శ్రీకారం చుట్టారన్నారు. గత టీడీపీ పాలనలో గిరి మీద గిరిజనుడు, ఊరి అవతల దళితుడులా పాలన సాగించారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తూ ప్రజలందరి గుండెల్లో నిలిచారన్నారు. గిరిజనులు, దళితులు, బీసీలను కించపరిచిన

చంద్రబాబు తీరును ఎవ్వరూ మరిచిపోలేదని తెలిపారు. సాలూరు నియోజకవర్గంలో 8,14,539 మంది లబ్ధిదారుల ఖాతాలకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.1,628 కోట్లు జమచేసినట్టు వెల్లడించారు. రూ.1085 కోట్ల ఖర్చుతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా డ్వాక్రా మహిళలు, రైతులు, యువతను మోసం చేశారని గుర్తుచేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 98 శాతం హామీలు అమలుచేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.



బస్సుయాత్రకు వచ్చిన అశేష జనవాహినికి నమస్కరిస్తున్న డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర



అన్ని వర్గాల ప్రజలకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీ గొడ్డేటి మాధవి వివరించారు. మంచి జరిగితేనే ఓటు వేయాలని కోరుతున్న ఒకేఒక్క నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మన్యంలో వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు.



గతంలో అధికారం చేపట్టిన చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు ఎద్దేవాచేశారు. ప్రజలకు నాడు ఏ మేలు చేయని చంద్రబాబు మళ్లీ ఇప్పుడు తనకు అవకాశం ఇవ్వాలని కోరుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ధరల పెంపును రాష్ట్రప్రభుత్వానికి అంటగడుతున్నారన్నారు. నిరుపేదలకు రూ.12,800 కోట్లు ఖర్చుచేసి ఇళ్లస్థలాలు ఇచ్చిన ఘనత ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. జగన్‌కు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు.



గాంధీజీ, అంబేడ్కర్, జ్యోతిరావుపూలే వంటి గొప్ప వ్యక్తులు ఆశయాలకు అనుగుణంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం వివరించారు. విద్య, వైద్యం తదితర అన్ని రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. గత టీడీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు కించపరిచారని ఫలితంగా 2019 ఎన్నికల్లో ప్రజలందరూ కలిసి చంద్రబాబును ఇంటికి సాగనంపారని వివరించారు. రాష్ట్ర ఖజానాను చంద్రబాబుతో కూడిన ముఠా దోపిడీ చేసిందని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధిని నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమచేస్తోందన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

రామభద్రపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. సాలూరు నియోజకవర్గంలో నిర్వహించిన సామాజిక సాధికారత యాత్రకు స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, పాముల పుష్పశ్రీవాణి, కంబాల జోగులు, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, బొత్స అప్పలనరసయ్యతో కలిసి వెళ్తూ బూసాయవలసలోని ఓ ప్రవేట్ కళ్యాణమండపం వద్ద కాసేపు సేదతీరారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని పథకాలు అమలుచేశారన్నారు. అందుకే సామాన్యులందరూ జగన్‌వైపే ఉన్నారన్నారు. 9వ తేదీ నుంచి నిర్వహించనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ చైర్ పర్సన్ శోభా స్వాతిరాణి, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, శంబంగి వేణుగోపాలనాయుడు, రాయులు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక సాధికార యాత్రకు బైక్‌ర్యాలీతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు

అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

బొండపల్లి/మెంటాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోనే అట్టడుగు వర్గాలు ఆర్థికోన్నతి చెందాయని జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మెంటాడ మండలం పోరాం గ్రామంలో బుధవారం సామాజిక సాధికారత బస్సుయాత్ర పారంభంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు మేలుచేసేలా సంక్షేమ పథకాలను సీఎం అమలుచేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కోర్టులకు వెళ్తే తప్ప గిరిజన సహకార మండలిని ఏర్పాటు చేయలేదన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.1200 కోట్ల ఖర్చుతో ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నట్టు తెలిపారు. అట్టడుగు వర్గాలకే మంత్రి పదవులతో పాటు, నామినేటెడ్ పదవులను జగనన్న ప్రభుత్వం కేటాయించిందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇది పూర్తయితే జిల్లా ముఖ చిత్రం దేశ పటంలో ప్రథమస్థానంలో నిలుస్తుందన్నారు. డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర సాలూరు నియోజకవర్గం పరిధిలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన చేశారన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించనున్నారన్నారు. టీడీపీలో రాజులకే తప్ప సామాన్యులను పట్టించుకునేవారు కాదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి ప్రజలు ముందుకు వెళ్లి ధైర్యంగా ఓట్లు అడుగుతామని, ప్రతిపక్షాలకు అడిగే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గ పరిశీలకులు వెంపాడ శ్రీనివాస రెడ్డి, దాసరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఆర్.రమాదేవి, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఏపీ కళింగ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ బెందాళం పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు శోభా హైమావతి, ఎం.నారాయణమూర్తిరాజు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ లెంక సన్యాసినాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు లారీలు ఢీ

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారిలో వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా బుధవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వచ్చిన రెండు లారీలు అదుపుతప్పి ఢీ కొన్నాయి. రెండు లారీలు ఢీ కొట్టుకోవడంతో పెద్ద శబ్దం రాగా సమీపంలో ఉన్న వారంతా ఏం జరిగిందోనని భయాందోళన చెందారు. అయితే రెండు లారీల ముందర భాగాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ఢీ కొన్న లారీలను రోడ్డు పక్కకు జరిపి ట్రాఫిక్ క్లియర్ చేసి,కేసు నమోదు చేశారు.

15 గ్యాస్ సిలిండర్ల సీజ్

రాజాం సిటీ: పట్టణంలోని పలు హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 15 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని సీఎస్‌డీటీ చిరంజీవరావు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో రాజాం, వంగర, చీపురుపల్లి, గరివిడి, భోగాపురం మండలాలకు చెందిన సివిల్ సప్లెస్ అధికారులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్లు గుర్తించి 15 సిలిండర్లను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్థానిక లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించామని సీఎస్‌డీటీ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గృహావసరాలకు సంబంధించిన గ్యాస్‌ను వాణిజ్య సముదాయాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పట్టణంలో తరచూ దాడులు నిర్వహించనున్నామని, ఈ దాడుల్లో పట్టుబడిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లెస్ అధికారులు చిరంజీవరావు, బి.మురళీకృష్ణ, రామకృష్ణ, శోభారాణి, సాయికామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారాతో పట్టుబడిన మహిళలకు రిమాండ్

కొత్తవలస: మండలంలోని గొల్లపేట గ్రామానికి చెందిన బొబ్బాది వరలక్ష్మి, లక్కవరపుకోట మండలం మార్లాపల్లి గ్రామంలో వడిసిల సింహాచలంను సారా అమ్ముతున్న కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఈబీ ఎస్సై పి.నరేంద్రకుమార్ తెలిపారు. ఆ ఇద్దరు మహిళలు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆ మహిళల ఇళ్లవద్ద తనిఖీ చేసి వరలక్ష్మి ఇంటి వద్ద లీటర్ సారాను, సింహాచలం ఇంటి వద్ద లీటర్ల సారాను గుర్తించామన్నారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేంద్రకుమార్ వివరించారు.

ఈ-క్రాప్, ఈకేవైసీ రైతులే అర్హులు

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో వరిపంట 2.31 లక్షల ఎకరాల్లో సాగవగా, 1,73, 613 మంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్నారని జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు తెలిపారు. వారంతా ఈకేవైసీ కూడా పూర్తి చేసుకున్నారని, వారి పంట మాత్రమే కొనుగోలుకు అర్హత కలిగి ఉందని చెప్పారు. రైతులు పంట కోతకు ముందు రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు షెడ్యూల్ చేయించుకోవాలని, ధాన్యం నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేవిధంగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న వాహనాల్లో మాత్రమే రవాణా చేయాలన్నారు. గోనె సంచులు, హమాలీలు రైతు ఏర్పాటు చేసుకుంటే వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌టీఓ చేతికందిన తర్వాత రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ చేయడానికి ఎవరైనా డబ్బులు అడిగితే ట్రోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫోన్‌చేసి వివరాలు తెలపాలని చెప్పారు. ధాన్యం అమ్మే విషయంలో ఎటువంటి ఇబ్బంది ఎదురైనా కంట్రోల్ రూమ్ నంబర్ 8331056278 తెలియజేయాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో అక్టోబర్ నెలలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల మూలంగా 5,601 ఎకరాల విస్తీర్ణంలో వరిపంట, 71 ఎకరాల్లో పత్తి, 90 ఎకరాల విస్తీర్ణంలో చోడిపంట పూర్తిస్థాయిలో ఎండిపోయిందన్నారు. అలాగే మరో 24,332 ఎకరాల్లో వరి పంటకు నీటి ఎద్దడి తీవ్ర స్థాయిలో ఉందని చెప్పారు. పంటల పరిశీలన నిమిత్తం కేంద్ర బృందం త్వరలో రానున్నదన్నారు. దెబ్బతిన్న పంటలకు నిబంధనలను అనుసరించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తిస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ నాగలక్ష్మి
- తెర్లాంలో జరిగిన జగనన్నకు చెబుదాం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్


ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను నమోదు చేస్తున్న ఉద్యోగులు

తెర్లాం: సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం తెర్లాంలోని మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకులు నర్సుపల్లి బాబ్జీరావు, గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలవగా ఎంపీడీఓ, తహసీల్దార్‌లు వారికి స్వాగతం పలికారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై సమర్పించిన 77 వినతులను కలెక్టర్, జేసీలు స్వీకరించారు.

కరువు మండలంగా ప్రకటించాలి

తీవ్ర వర్షాభావ పరిస్థితులు మండలంలో ఏర్పడడంతో పలు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో వేసిన వరిపంట పూర్తిగా పోయిందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తెర్లాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు రామారావు, వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు కలెక్టర్‌ను కోరారు. అలాగే మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించడంతోపాటు, మామిడి తోటల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో తాగునీటి సమస్య ఉందని, జలజీవన్ మిషన్ మండలాన్ని యూనిట్‌గా కాకుండా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పనులు మంజూరు చేయాలని విన్నవించారు. బీటీ రోడ్లు లేని గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయని, బిల్లులు సకాలంలో చెల్లిస్తే నిర్మాణం చేపడతామని వారు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం

గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని సకాలంలో పరిష్కరించేందుకే మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. జిల్లాలో ఇప్పటికి 9 మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను నిర్వహించామని, మిగిలిన మండలాల్లో కూడా నిర్వహిస్తామని తెలిపారు. స్పందనలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎందుకు ఆ సమస్యను పరిష్కరించలేకపోయారో వారికి వివరించాలని చెప్పారు. తెర్లాంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం విజయవంతం కావడంతో కలెక్టర్ సంతృప్తిని వ్యక్తంచేసి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్, ఇతర అధికారులను అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, బొబ్బిలి ఆర్డీవో సాయిశ్రీ, జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీఓ వి.లక్ష్మణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్లు

- రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన బాలికలు
- తృతీయ స్థానం సాధించిన బాలుర జట్టు


రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ, తృతీయస్థానాలు సాధించిన బాలికలు, బాలుర జట్లు

తెర్లాం: రాష్ట్రస్థాయి 67వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికలు, బాలుర జట్లు సత్తా చాటాయి. ఈ నెల 4 నుంచి 6వరకు మూడు రోజులపాటు ప్రకాశం జిల్లా ఒంగోలులో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన బాలికల జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించగా, బాలుర జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును కనబరిచి జిల్లా జట్లు పతకాలు సాధించడం పట్ల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల పీడీలు, పీఈటీలు క్రీడాకారులను అభినందించారు.

స్విమ్మింగ్, తైక్వాండో పోటీలకు జిల్లా జట్ల పయనం



స్విమ్మింగ్ పోటీలకు బయలుదేరుతున్న జిల్లా అండర్-19 జట్టు


తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాల, బాలికల స్విమ్మింగ్, తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు బుధవారం పయనమయ్యాయి. ఈనెల 9 నుంచి తిరుపతి వేదికగా జరగనున్న పోటీలకు రెండు క్రీడాంశాల్లో 20 మందికి పైగా క్రీడాకారులు జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్‌కృష్ణ మాట్లాడుతూ తిరుపతి వేదికగా అండర్-19 విభాగంలో స్విమ్మింగ్, తైక్వాండో పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనబోయే క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి విజేతలుగా నిలవడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ అధ్యాపకులు, కోచ్ అండ్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

- రూ.2లక్షల,14వేలు మాయం


షాపు వెనుక వైపు చేసిన రంధ్రం

కొత్తవలస: మండలంలోని ఎస్.కోట రోడ్డులో ఉన్న నిహారిక హాస్పిటల్ సమీపంలో గల ప్రభుత్వ మద్యం షాపులో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి షాపులో చొరబడి రూ 2.14లక్షల నగదు దోచుకున్న విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షాపు వెనుకన మనిషి దూరేంత రంధ్రం చేసి దుండగుడు లోనికి ప్రవేశించి కౌంటర్‌లో గల రూ. 2.14లక్షలు నగదు, రెండు క్వార్టర్ బాటిల్సను తీసుకెళ్లిపోయినట్లు షాపులో పనిచేసే సూపర్‌వైజర్ కర్రి మహేశ్వరరావు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

రైల్వే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ లిఫ్టర్ల ప్రతిభ


పోటీల్లో బరువును ఎత్తుతున్న కోరాడ రమణ

నెల్లిమర్ల రూరల్: ముంబైలో ఈ నెల 6వ తేదీ నుంచి జరుగుతున్న అఖిల భారత రైల్వే వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో కొండవెలగాడ గ్రామానికి చెందిన లిఫ్టర్లు ప్రతిభ కనబరిచారు. 55 కేజీల పురుషుల విభాగంలో బుధవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న వల్లూరు చిన్నంనాయుడు 185 కేజీల బరువును ఎత్తి మూడో స్థానం, 55 కేజీల మహిళల విభాగంలో మత్స సంతోషి 146 కేజీల బరువును ఎత్తి మూడో స్థానం, 67 కేజీల పురుషుల విభాగంలో కోరాడ రమణ 252 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన లిఫ్టర్లకు జెడ్పీటీసీ గదల సన్యాశినాయుడు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

లంచం కేసులో ఏసీబీ కోర్టు తీర్పు

విజయనగరం క్రైమ్: లంచం తీసుకున్న కేసుకు సంబంధించి ఏసీబీ కోర్టు బుధవారం తీర్పు వెల్లడించిందని ఏసీబీ డీఎస్పీ పి.రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటన వివరాలిలా ఉన్నాయి. పలాసకు చెందిన ప్రేమ్‌కుమార్‌కు ఆయన తల్లిపేరున రైస్ మిల్లు ఉండేది. ఆ మిల్లుకు 25 హెచ్‌పీ పవర్‌లైన్ వేసే విషయంలో 2013లో అప్పటి ఏడీఈ ఎస్.మధుసూదనరావు రూ.20వేలు డిమాండ్‌చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా అధికారులు ట్రాప్ చేసి ఏడీఈని అరెస్టు చేసి, కోర్టుకు తరలించారు. ఈ కేసులో విచారణ అనంతరం ముద్దాయికి నాలుగేళ్లు కఠిన కారాగార శిక్ష, ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష, రూ. 20వేలు జరిమానా విధిస్తూ విశాఖలోని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఆర్ వీవీఎస్ మురళీకృష్ణ తీర్పు తీర్పు వెల్లడించారని డీఎస్పీ తెలిపారు. మధుసూధనరావు ప్రస్తుతం ఏలూరులో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న హెచ్ఎం, సహోపాధ్యాయులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చనుమల్లు కవిత, కె.సందీప్, అండర్-17విభాగంలో అండర్-14 విభాగంలో పి.సావిత్రి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గడసాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో ఈనెల 9,10,11 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు పి.మధుసూదన్, పీడీ శ్రీకాంత్, ఉపాధ్యాయులు సత్యశ్రీనివాస్, ధనుంజయ్ అభినందించారు.

లావణ్య ప్రతిభతో జిల్లాకు ఖ్యాతి

- వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మూడు పతకాలు కైవసం


సాధించిన పతకాలు చూపిస్తున్న లావణ్య

నెల్లిమర్ల రూరల్: కేరళ రాష్టంలోని త్రిసూర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో జిల్లాకు చెందిన లావణ్య రెండు బంగారు, ఒక వెండి పతకాన్ని సాధించి విజయనగరం జిల్లా పరువు పెంచింది. నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన లావణ్య 55 కేజీల జూనియర్ విభాగంలో బంగారు పతకం, సబ్ జూనియర్ విభాగంలో బంగారు పతకం, సీనియర్ విభాగంలో వెండి పతకాన్ని కైవసం చేసుకుంది. జాతీయస్థాయి పోటీల్లో మూడు పతకాలు సాధించిన లావణ్యకు కోచ్ రవి, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బొలెరో ఢీకొని యువకుడి మృతి


మరణించిన కేకేవై కిరణ్ (ఫైల్)

డెంకాడ: మండలంలోని మోదవలస వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను బొలెరో ఢీకొట్టడంతో ఓ యువకుడు బుధవారం మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఎస్సై మహేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లాలోని పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కేకేవై కిరణ్(20) విజయనగరం నుంచి బైక్‌పై విశాఖ వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టడంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

గుర్తు తెలియని వ్యక్తి...


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు బుధవారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుడివాడ గ్రామ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద ఆయన గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని గజపతినగరం ఏరియా ఆస్పత్రికి పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై రైల్వే ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణలోని నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్‌బీఐ డీజీఎం అవంతి


మాట్లాడుతున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం అవంతి

విజయనగరం అర్బన్: ఉచిత శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం అవంతి అన్నారు. ఈ మేరకు స్థానిక ఆర్‌కే టౌన్‌షిప్‌లోని జీఎంఆర్ వరలక్ష్మి ఉపాధి శిక్షణ కేంద్రంలో నాబార్డ్ సహకారంతో నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణ తరగతులను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా 'భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నైపుణ్యం ప్రదర్శించి వివిధ సంస్థలలో ఉద్యోగ, వ్యాపార అవకాశాలను సంపాదించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఆర్‌బీఐ మేనేజర్ సంకర్ బిత్ భజిని, నాబార్డ్ డీడీఎం నాగార్జున, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ అసోసియేట్ మేనేజర్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జ్ కేవీరమణ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం..



బంద్‌లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ ఉక్కు పోరాటానికి నవంబర్ 8తో 1000 రోజులవుతున్న సందర్భంగా, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకోసం విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ మేరకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి పలు పాఠశాలలో కళాశాలలో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. అనంతరం కోట జంక్షన్ వద్ద నిరసన, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగభూషణం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కె.గౌతమి మాట్లాడుతూ విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన రాష్ట్రస్థాయి విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుద్రరాజు, హరీష్ , ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, సౌమ్య, రామకష్ణ పి.గౌరీశంకర్, ఎ. సుమన్ తదితర విద్యార్థి యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి ఎస్పీ ప్రశంసలు


కిశోర్‌ను అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జాతీయస్థాయిలో నిర్వహించిన తైక్వాండో ఓపెన్ చాంపియన్‌షిప్‌లో బంగారుపతకం సాధించిన పోలీస్‌వెల్ఫేర్ స్కూల్ విద్యార్థి శెట్టి కిశోర్‌ను ఎస్పీ ఎం.దీపిక బుధవారం ప్రశంసించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అక్టోబరు 5 నుంచి 8 వరకూ న్యూఢిల్లీలోని నోయిడా ఇండోర్ స్టేడియంలో జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహించగా, అందులో పాల్గొన్న పోలీసు సంక్షేమ పాఠశాల విద్యార్థి బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఎస్సై నారాయణరావు, ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

పార్వతీపురం: రాష్ట్రస్థాయి 67వ కరాటే పోటీలు జిల్లాలో ఈనెల 9నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ బుధవారం తెలిపారు. 14,17,19 సంవత్సరాల లోపు బాలురు, బాలికలకు నిర్వహించే రాష్ట్రస్థాయి కరాటే పోటీలు సీతానగరం మండలంలోని జోగింపేట డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జమ్మానపై కేసు కొట్టివేత

- హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పార్వతీపురం: మండలంలోని డీకేపట్నం పంచాయతీలో గల బోడికొండలోని గ్రానైట్‌ను లీజుకు ఇచ్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నంపై వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్మాన ప్రసన్నకుమార్ గిరిజనుల తరఫున పోరాటం చేశారు. ఈ పోరాటంలో జమ్మాన ప్రసన్న కుమార్‌ను ప్రథమ ముద్దాయిగా చేస్తూ మరో 29మందిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం 2017లోక్రిమినల్ కేసు నమోదు చేసింది. అప్పటి నుంచి దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ కాలం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో కేసు కొనసాగింది. జమ్మాన ప్రసన్నకుమార్ తరఫున న్యాయవాది డి. శాంతిరాజు ఈ కేసును వాదించారు. ఈ కేసులో వాదోపవాదాలు పూర్తయిన తరువాత జమ్మాన ప్రసన్నకుమార్‌ను నిర్దోషిగా గుర్తించి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పునిచ్చారు.

సంతోషంగా బాణసంచా కాల్చివేత

దాదాపు 15వేల గిరిజన కుటుంబాల హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పార్వతీపురం సమన్వయకర్తగా అప్పట్లో ఉన్న జమ్మాన ప్రసన్నకుమార్‌తో పాటు సీపీఎం నాయకులు రెడ్డి శ్రీరామ్మూర్తి తదితరులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం అక్రమ కేసులను నమోదు చేసింది. కేసు విచారణ జరుగుతుండగానే సీపీఎం నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి, మరో ఇద్దరు స్వర్గస్తులయ్యారు. దాదాపు ఏడేళ్లపాటు కోర్టులో విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో జమ్మాన ప్రసన్నకుమార్‌తోపాటు మిగిలిన వారిపై ఉన్న కేసును కొట్టివేస్తూ నిర్దోషులుగా ప్రకటిస్తూ బుధవారం తీర్పు వెలువడడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పోరాటానికి నైతిక మద్దతు తెలిపిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం రాజన్నదొర, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణితోపాటు పలువురు తనకు మద్దతు తెలిపారని చెప్పారు. ఈ సందర్భంగా గిరిజనులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹102	₹174	₹184

ప్రభుత్వ మద్యం దుకాణాలపై పటిష్ట నిఘా

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాలపైనా పటిష్ట నిఘా ఏర్పాటుచేసి ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలని విజిలెన్స్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ సారా, నాన్ డ్యూటీపెయిడ్ లిక్కర్, ఇతర మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో దాడులు నిర్వహించాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ, జిల్లా మద్యనిషేధ, అబ్కారీ అధికారి ఆర్ఓ స్టాంప్‌ను ఎప్పటికప్పుడు మార్పు చేస్తూ అవకతవకలు చేసిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. శ్రీనాథుడు, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.వెంకటరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.